సాక్షి
సిద్దిపేట
శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



నష్టాల ఊబిలో 'చింత' రైతు
మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక చింత సాగు చేసిన రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. దీనికి తోడు ఈసారి బీడపీడలు ఆశించి 40 శాతం మేర పంటకు నష్టం వాటిల్లింది. 8లో..



డివైడర్ ఢీకొని విద్యార్థి మృతి
బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ విద్యార్థి మృతి చెందాడు. మరో విద్యార్థికి గాయాలయ్యాయి. జోగిపేట ఫైర్‌స్టేషన్ మలుపు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. 8లో..



హనుమాన్ ఆలయాల్లో సందడి
జిల్లా వ్యాప్తంగా హనుమాన్ జయంతిని గురువారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామిని దర్శించుకున్నారు. 9లో..

రంజాన్ వేళలు

శుక్రవారం ఇఫ్తార్	శనివారం సహర్
సా.6:35	ఉ.4:42

న్యూస్‌రీల్

ఇంగ్లిష్ పరీక్షకు 99.92శాతం హాజరు



ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ మహేందర్, తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో గురువారం నిర్వహించిన పదో వతరగతి ఇంగ్లిష్ పరీక్షకు 99.92 శాతం హాజరు నమోదైంది. 14,156 మంది విద్యార్థులకు గాను 14,146 మంది హాజరవగా, 10 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీకిరణ్, అడిషనల్ డీసీపీ మహేందర్, పరీక్షల సహాయ అధికారి లక్ష్మయ్య పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్ట భద్రత ఏర్పాటు చేసినట్లు అడిషనల్ డీసీపీ మహేందర్ తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి ఇన్విజిలేటర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది ఇతర అధికారులు ఎవరూ సెల్‌ఫోన్ తీసుకువెళ్లొదని సూచించారు. పోలీస్ స్టేషన్ నుంచి ఎస్కార్ట్ ద్వారా కేంద్రాలకు పేపర్ తీసుకెళ్లాలని సిబ్బందికి ఆదేశించారు.

ఆరోగ్య పరిరక్షణకు యోగా అవసరం


సిద్దిపేట జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి

సిద్దిపేటకమాన్: యోగాతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని సిద్దిపేట జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి అన్నారు. జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించిన లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ, వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి రోజు వ్యాయామం, యోగా చేస్తే శారీరక, మానసిక ప్రశాంతత సొంతం కావడంతో పాటు అన్నిరకాల రోగాలను దూరం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ సదానందం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, న్యాయవాదులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ అన్నారు. గురువారం జిల్లా అధ్యక్షుడు ఊడెం రఘువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి, అనంతరం కలెక్టర్ ఏఓ అబ్దుల్ వహీద్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ ఆలస్యం కావడంతో అర్హులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీనెలా సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతో ఉపాధ్యాయులు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ మాట్లాడుతూనూతన పీఆర్సీ ఐఆర్ ప్రకటించాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు బేసిక్ పే మంజూరు చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీధర్, రాష్ట్ర బాధ్యుడు శ్రీనాకర్ రెడ్డి, సింగోజు జనార్దన్, వంగ నర్సిరెడ్డి, మహేందర్ రెడ్డి, శివకుమార్, జిల్లా బాధ్యులు మధు, శశి, శ్రీను, స్వామి, కిష్టారెడ్డి, బాల భాస్కర్, సిద్ధారెడ్డి, బుచ్చిరెడ్డి, శ్రీను, తిరుపతి రెడ్డి, రమణ, శ్రీకాంత్, వెంకట్రాంరెడ్డి, రవి, చారి, సురేందర్ రెడ్డి, జైపాల్ యాదవ్, రాములు, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం కొందరికే..

- మార్చి 21వరకే వివరాల నమోదు
- మార్చి 28న హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడలో వడగళ్ల వాన
- సుమారు 1,250 ఎకరాల్లో పంట నష్టం
- కటాఫ్‌తో నష్టపోనున్న రైతులు



కోహెడలో వర్షానికి నేలమట్టమైన మొక్కజొన్న (ఫైల్)

సాక్షి, సిద్దిపేట/హుస్నాబాద్: జిల్లాలో పంట నష్ట పరిహారం కొందరికే అందనుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మార్చి 16 నుంచి 21వ తేదీ వరకు పంట నష్టపోయిన వివరాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కాగా మార్చి 28న జిల్లాలో కురిసిన వడగళ్ల వానతో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడలో సుమారు 1250 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ప్రభుత్వం కటాఫ్ తేదీ 21వరకే విధించడంతో ఆ తేదీ తర్వాత జరిగిన నష్టాన్ని అధికారులు పరిగణలోకి తీసుకోలేదు. దీంతో ఈ మూడు మండలాల రైతులకు ప్రభుత్వ సాయం దూరంకానుంది.

జిల్లాలో 2,366 ఎకరాల్లో నష్టం

- మార్చి 16 నుంచి జిల్లాలో కురిసిన అకాల వర్షాలకు సుమారు 2,366 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.
- పంట నష్టపోయిన వారికి ఎకరాకు రూ.10వేలను అందిస్తామని సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమైంది.
- వ్యవసాయ అధికారులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు.
- మార్చి 16 నుంచి 21వ తేదీ వరకు 1,237 మంది రైతులకు చెందిన 1,146.11 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వివరాలు నమోదు చేశారు.
- ఇందులో మొక్కజొన్న 1069.18 ఎకరాలు, సన్ ఫ్లవర్ 66.37, వరి 9.36 ఎకరాలు ఉన్నట్లుగా లెక్క తేల్చారు.
- కాగా మార్చి 28న వడగళ్ల వానకు హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో 1,250 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.
- వరి 400, మొక్కజొన్న 800, మామిడి 30, సన్ ఫ్లవర్ 20 ఎకరాల్లో పాడయ్యాయి.
- ప్రభుత్వం మార్చి 21వ తేదీ వరకు కటాఫ్ విధించడంతో ఈ రైతుల వివరాలు సేకరించలేదు. తేదీని పొడిగిస్తేనే మళ్లీ సర్వే చేస్తామని అధికారులు చెబుతున్నారు.
- ప్రభుత్వం కటాఫ్‌ను పొడిగించి తమకూ పరిహారం అందించి ఆదుకోవాలని ఆయా మండలాల రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



రెండెకరాల్లో చేతికొచ్చిన మొక్కజొన్న పంట వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. అప్పు చేసి పంట సాగు చేశా. మందులు, ఎరువులు చల్లి కాపాడుకున్న పంట వడగళ్ల వానతో నేలవాలింది. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలి.

– పులికూరి వెంకటరెడ్డి, గోవర్ధనగిరి

రీ సర్వే చేయాలి



వడగళ్ల వానతో నాలుగెకరాల్లో మామిడి తోటలో కాయలు రాలి తీవ్రంగా నష్టపోయా. గతేడాది కూడా ఇదే పరిస్థితి. నేల రాలిన కాయలను మార్కెట్‌కు తీసుకువెళ్తే ఎవరూ కొనడంలేదు. పెట్టుబడి కూడా రాని పరిస్థితి. అధికారులు రీసర్వే చేసి పరిహారం అదించాలి.

– పంగ మహేందర్ రెడ్డి, గోవర్ధనగిరి

ధాన్యం సేకరణలో ఇబ్బందులు రానివ్వొద్దు

రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ అనిల్ కుమార్



కమిషనర్ అనిల్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, సీపీ శ్వేత

సిద్దిపేటరూరల్: 2022–23కు సంబంధించి ధాన్యం సేకరణలో ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, జిల్లా అధికారులకు సూచించారు. గురువారం సిద్దిపేటకు వచ్చిన ఆయనకు కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, పోలీస్ కమిషనర్ శ్వేత పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 416 కొనుగోలు కేంద్రాల ద్వారా 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రానున్నట్లు అంచనా వేసినట్లు కలెక్టర్ ఆయనకు వివరించారు. సీఎంఆర్ ధాన్యం విషయంలో రికవరీపై దృష్టి సారించాలన్నారు. అనంతరం డీఎంహెచ్ఓ, డీపీఓతో కార్యాలయంలో సమావేశమయ్యారు. తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి సీ.హెచ్ బ్రహ్మారావు, జిల్లా మేనేజరు హరీశ్ పాల్గొన్నారు.

ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలి



కార్యాచరణ కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కార్పొరేట్ విద్యాసంస్థలను కట్టడి చేసేందుకు ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాపార్తి లింగమూర్తి, కార్యదర్శి నాగరాజు అన్నారు. గురువారం సిద్దిపేటలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర కమిటీ సమావేశాల్లో భవిష్యత్ పోరాట ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. నూతన విద్యా విధానం రద్దు చేయాలని కోరుతూ జూలైలో బస్సు యాత్ర నిర్వహిస్తామన్నారు. పేపర్ లీకేజీతో నష్టపోయిన విద్యార్థులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలన్నారు. పదో తరగతి పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పాఠ్యపుస్తకాల ధరను పెంచే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ఉద్యోగ కేలండర్ విడుదల చేసి పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ చేయాలని కోరారు. అంతకు ముందు ఎస్ఎఫ్ఐ కార్యాచరణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ప్రశాంత్, పూజ, మిత్రీన్ సుల్తానా, జిల్లా అధ్యక్షుడు అరవింద్, నాయకులు శేఖర్, నవీన్, సంజీవ్‌కుమార్, సంతోష్, అంజలి పాల్గొన్నారు.

తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీటి విడుదల



తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి పంపింగ్ అవుతున్న నీరు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు గురువారం సాయంత్రం బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలను విడుదలైనట్లు ఇరిగేషన్ ఏఈ రాజశేఖర్ తెలిపారు. ఇటీవల ఎండల తీవ్రత పెరగడం, రైతులు మోటార్లతో పంటపొలాలాకు నీటిని వాడడంతో రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గింది. దీంతో రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేయాలని రైతులు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయించారు. దీంతో కొమురవెల్లి, చేర్యాల, బచ్చన్నపేట మండలాల రైతులకు లబ్ధిచేకూరనుంది.

రానున్నది బీజేపీ ప్రభుత్వమే

జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి



పార్టీ జెండాను ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఏక్ బార్ ఫిర్ సే మోదీ సర్కార్ అనే వాల్ పెయింటింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో దేశంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని, బీజేపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రశ్నించే గొంతులను ప్రభుత్వం నొక్కాలని చూస్తోందని ఆరోపించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్ట్ అప్రజాస్వామికం అని, రాష్ట్రంలో అరాచక పాలనను ప్రజలను గమనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ ఉపేందర్ రావు, రోశయ్య, పురుమాండ్ల నర్సింహారెడ్డి, గాడిపల్లి అరుణ, యాదన్‌రావు, భోగి శ్రీనివాస్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి



సమ్మేళన వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): సిద్దిపేటలో ఈనెల 8న నిర్వహించే రెడ్డి ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని రెడ్డి సంఘం ఐక్య కార్యాచరణ మండల కమిటీ ప్రతినిధి జొర్రిగాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కొమురవెల్లి మండలంలోని కిష్టంపేట, గౌరయపల్లి, రాంసాగర్, మర్రిముచ్చాల గ్రామాల్లో సమ్మేళనానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సిద్దిపేట పొన్నాల బైపాస్ రోడ్డులో భైరి అంజయ్య గార్డెన్‌లో సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కులబాంధవులు భారీగా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో దండ్యాల లక్ష్మారెడ్డి, అక్కెనపల్లి నరేందర్ రెడ్డి, బోడుగాం కృష్ణారెడ్డి, బొంగు చంద్రశేఖర్ రెడ్డి, దండ్యాల భిక్షపతిరెడ్డి, దండ్యాల కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



12 అడుగుల హనుమాన్ భారీ విగ్రహం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హనుమాన్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో 12 అడుగుల భారీ హనుమాన్ విగ్రహంతో నిర్వహించిన ర్యాలీ ఆకట్టుకుంది. రంగథాంపల్లి హనుమాన్ ఆలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా, నర్సాపూర్ చౌరస్తా, శరభేశ్వర ఆలయం, లాల్ కమాన్, వేంకటేశ్వర స్వామి ఆలయం, కంచీట్ చౌరస్తా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉమాపార్థీశ్వర కోటిలింగాల ఆలయం నుంచి రూరల్ పోలీస్ స్టేషన్, హనుమాన్ ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. శ్రీరామ, హనుమాన్ నామస్మరణతో పట్టణం మార్మోగింది. ర్యాలీలో మహారాష్ట్రకు చెందిన బ్యాండ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాషాయ రంగు దుస్తులు ధరించి యువకులు నృత్యాలు చేశారు. ఆలయాల పరిరక్షణకు కృషి చేయాలని విశ్వహిందు పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ బాలస్వామి కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు గ్యాదరి రాజారాం, నరేష్, నాగేందర్, శ్రీనివాస్, మురళీ, ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్‌గౌడ్, బీజేపీ నాయకులు కొత్తపల్లి వేణుగోపాల్, జనార్థన్, తదితరులు పాల్గొన్నారు.

12న వాహనాల వేలం

సిద్దిపేటకమాన్: జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌ల పరిధిలో అన్నోన్ ప్రాపర్టీ వాహనాలకు ఈ నెల 12న వేలం నిర్వహించనున్నట్లు సిద్దిపేట పోలీసు కమిషనర్ శ్వేత తెలిపారు. వివిధ పోలీసు స్టేషన్లలో 66 ద్విచక్రవాహనాలు, 5 ఆటోలు, 5 ఫోర్ వీలర్స్ ఉన్నాయని, సంబంధిత వాహన యజమానులు సరైన ధృవపత్రాలు చూపించి వాహనాలను తీసుకెళ్లాలని ఆరు నెలల క్రితం సూచించామన్నారు. ఎవరూ రానందున అన్నోన్ ప్రాపర్టీగా పరిగణించి వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు గుర్తింపు కార్డుతో హాజరవాలని, పూర్తి వివరాలకు కంట్రోల్ రూమ్ 8333998699, ఎమ్‌టీ సెక్షన్ కానిస్టేబుల్ విజయ్‌కిరణ్ 9550936373 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నకిలీకి చెక్ పడేనా?

- విత్తన హబ్‌గా గజ్వేల్, సిద్దిపేట
- తనిఖీలు లేక ప్రాసెసింగ్‌లో అక్రమాలు
- అధికారులు దృష్టిపెడితేనే అడ్డుకట్ట
- మరికొద్ది రోజుల్లో సీజన్ ప్రారంభం



గజ్వేల్‌లో ఓ విత్తన కంపెనీలో తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు (ఫైల్)

గజ్వేల్: భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విత్తన ప్రాసెసింగ్‌లో సిద్దిపేట జిల్లా కీలకంగా మారుతోంది. రాష్ట్రంలో హయత్‌నగర్, మేడ్చల్, ఆర్మూర్, భూత్పూర్ తదితర ప్రాంతాల తర్వాత గజ్వేల్, సిద్దిపేట ప్రాంతాలు విత్తన ప్రాసెసింగ్‌లో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. కాగా కొన్ని కంపెనీలు ప్రాసెసింగ్ సమయంలో నాణ్యతను పాటించకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో పలు అక్రమాలు బయటపడిన ఘటనలు ఉన్నాయి. కాగా వచ్చే నెల నుంచి విత్తన ప్రాసెసింగ్ ప్రారంభం కానుండడంతో వ్యవసాయ, పోలీసు శాఖలు అప్రమత్తమై నకిలీ విత్తనాలు మార్కెట్‌కు రాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా...

సిద్దిపేట జిల్లాలో గజ్వేల్, సిద్దిపేట ప్రాంతాలు విత్తన ప్రాసెసింగ్‌కు ప్రధాన కేంద్రంగా వర్ధిలుతున్నాయి. ఇక్కడ 30కిపైగా కంపెనీలు వాటి కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉండటం, వనరుల లభ్యతతో కంపెనీలు ఏర్పాటు చేసేందుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. కాగా ప్రాసెసింగ్ సక్రమంగా చేయకుండా, నాణ్యతా పరీక్షలతో ప్రమేయం లేకుండా విత్తనాలను మార్కెట్‌లోకి వదలుతున్నాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడటంతోనే రిజెక్ట్ అయిన విత్తనాలు ప్యాకింగ్ రూపంలో మార్కెట్‌కు వస్తున్నాయి. నకిలీ విత్తన బెడద నిర్మూళనకు అధికారుల సూక్ష్మ పరిశీలన అవసరం.

నిబంధనలు ఇలా..

- వరి విత్తనాలకు సంబంధించి మొదట పరిశోధనా కేంద్రంలో శాస్త్రవేత్తలు బ్రీడర్ సీడ్‌ను ఎంపిక చేసి, రైతుల పొలాల్లో ఫౌండేషన్ సీడ్‌గా ఉత్పత్తి చేస్తారు.
- మరికొంత మంది రైతుల పొలాల్లో విత్తనోత్పత్తిగా వేసి, వచ్చిన విత్తనాన్ని సర్టిఫైడ్ లేబుల్ సీడ్‌గా సేకరిస్తాయి.
- మొక్కజొన్న విత్తనాలకు సంబంధించి ఆడ, మగ విత్తనాన్ని సంకరణం చేసి వచ్చే కంకులను కంపెనీలు సేకరించి క్లీనింగ్, గ్రేడింగ్ చేసి ప్యాకింగ్ చేస్తాయి.
- పత్తి విత్తనాలకు సంబంధించి ఆడ, మగ విత్తన సంకరణం చేసి, వాటిపై ఉండే దూదిని యాసిడ్ ద్వారా శుద్ధి చేసి ప్యాకింగ్ చేయాలి.
- కంపెనీలో క్లీనింగ్, గ్రేడింగ్ చేసి సర్టిఫైడ్ అనంతరం తమ బ్రాండ్ పేరుతో మార్కెట్‌లోకి విడుదల చేస్తుంటాయి.
- ప్యాకింగ్ సమయంలో విత్తన కంపెనీలు స్టేట్ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ అనుమతి పొందాల్సి ఉంటుంది.
- కాగా జిల్లాలో విత్తన ప్రాసెసింగ్ సమయంలో కంపెనీలు నిబంధనలు పాటించడంలేదనే వాదన వినపడుతోంది.
- రిజక్ట్ అయిన విత్తనాలను గుట్టుచప్పుడు కాకుండా మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
- గతంలో జరిగిన అక్రమాలు ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి.

రెండేళ్ల క్రితం..

- 2021 జూన్‌లో ములుగు మండలంలోని ఓ కంపెనీలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా మార్కెట్‌లోకి విడుదల చేసేందుకు సిద్ధం చేసిన 2,384 క్వింటాళ్ల వరి విత్తనాలను అధికారులు పట్టుకున్నారు.
- ములుగు ఏడీఏ అనిల్, గజ్వేల్ రూరల్ సీఐ కోటేశ్వర్‌రావు, ములుగు ఎస్ఐ రంగ కృష్ణ ఆధ్వర్యంలో దాడి చేసి నిల్వను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.
- ఇది జరిగిన కొద్ది రోజులకే ఇదే మండలంలో మరో విత్తన కంపెనీలో రిజెక్ట్ అయిన స్టాక్ వివరాలను ప్రభుత్వానికి అందించకుండా కంపెనీలో సాధారణ స్టాక్‌తో కలిపి నిల్వ చేశాయడంతో అధికారులు నోటీసులు ఇచ్చారు.
- గతేడాది వ్యవసాయశాఖ విస్తృతంగా తనిఖీలు చేపట్టి పలు కంపెనీలకు నోటీసులు ఇచ్చింది.
- నాణ్యత పరీక్షలతో ప్రమేయం లేకుండా రిజెక్ట్ అయిన నకిలీ విత్తన ప్యాకెట్లు మార్కెట్‌లోకి రాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరంఉంది.

నిబంధనలు పాటించాలి

విత్తన కంపెనీలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాసెసింగ్, ప్యాకింగ్ చేపట్టాలి. నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపడతాం. మే నెల నుంచి నిరంతరం పర్యవేక్షణ ప్రారంభిస్తాం.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

కొనసాగుతున్న ఇంటర్ మూల్యాంకనం

సిద్దిపేటఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం కొనసాగుతుంది. సబ్జెక్టుల వారిగా అధ్యాపకులు జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్ గురువారం తెలిపారు. ఈ నెల 9న ప్రారంభం కానున్న బోటనీ, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టుల మూల్యాంకనం రెండురోజులు ఆలస్యంగా ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ మూడు సబ్జెక్టుల అధ్యాపకులు ఈనెల 11న రిపోర్టు చేయాలని సూచించారు.

సిద్దిపేట మెడికల్ కళాశాలకు రూ.1.25కోట్లు మంజూరు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలకు రూ.1.25కోట్ల నిధులు మంజూరు చేస్తూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు వెలువరించింది. ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు, ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పన, అనుబంధ ఆస్పత్రిల్లో భవన నిర్మాణం, పరికరాల కొనుగోలుకు నిధులు వినియోగించనున్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనం, అనుబంధంగా నిర్మిస్తున్న వెయ్యి పడకల ఆస్పత్రి భవన నిర్మాణం, సివిల్ పనులకు వినియోగించనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

స్టోరేజ్ పాయింట్ పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న రాష్ట్ర డైరెక్టర్ రాధారెడ్డి

నర్సాపూర్: పదో తరగతి పరీక్ష ప్రశ్న పత్రాల స్టోరేజ్ పాయింట్‌ను రాష్ట్ర అధికారి గురువారం పరిశీలించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెనింగ్ డైరెక్టర్ రాధారెడ్డి పదో తరగతి ప్రశ్న పత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచే పాయింట్‌ను గురువారం ఉదయం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్టుమెంటల్ ఆఫీసర్లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. స్టోరేజ్ పాయింట్ నుంచి తరలించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం



మెదక్ రూరల్: మెదక్ జిల్లా హవేళిఘణాపూర్ మండలం శమ్నాపూర్ బస్టాండ్‌లో గురువారం గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు. మృతుడి వయస్సు 28 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిస్తే 8712657921 ఎస్‌ఐ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బైక్, ఆర్టీసీ బస్సు ఢీ


ఇద్దరికి స్వల్ప గాయాలు



దుబ్బాక రూరల్: ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని రఘోత్తంపల్లి గ్రామంలో గురువారం జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజన్నసిరిసిల్లా జిల్లాకు చెందిన ఆర్టీసీ బస్సు కామారెడ్డి జిల్లా బీబీపేట నుంచి రఘోత్తంపల్లి వెళ్తోంది. సిద్దిపేటకు చెందిన ముగ్గురు వ్యక్తులు గోసాన్‌పల్లికి పని నిమిత్తం వచ్చి తిరిగి వెళ్లతున్నారు. ఈ క్రమంలో బైక్‌ను బస్సు ఢీకొట్టడంతో కనకయ్య, చంద్రయ్యకు స్వల్పగాయాలయ్యాయి. వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నష్టాల ఊబిలో చింత రైతులు

- పడిపోయిన చింత పండు ధరలు
- చీడపీడలతో పంటకు తీవ్ర నష్టం
- వడగండ్లతో రెట్టింపు
- కొనేవారు లేక నేలపాలు
- ఆందోళనలో రైతన్నలు



కోహీర్‌లో పురాతన చింతచెట్టు

కోహీర్(జహీరాబాద్): చింతను సాగుచేస్తున్న రైతులకు చింతే మిగిలింది. మార్కెట్లో గిట్టుబాటు ధర లభించక వారు ఆర్థికంగా నష్టపోతున్నారు. దీనికి తోడు కనివిని ఎరుగని రీతిలో ఈసారి చింతకు చీడపీడలు సోకి 40 శాతం మేర పంటకు నష్టం వాటిల్లింది. ఇటీవల కురిసిన వడగండ్ల వానతో తడిసి పాడై రైతులు మరింత నష్టపోయారు. కొనేవారు కరువై పండి కోతకొచ్చి నేలపాలవుతోంది. సీజన్‌లో పాతాళానికి పడిపోతున్న చింతపండు ధర ఇతర కాలాల్లో ఆకాశాన్నంటుతోంది.

- కోహీర్ మండలం జామ, అల్లం పంటలతో పాటు చింత సాగుకు ప్రసిద్ధి. మండల కేంద్రమైన కోహీర్‌తో పాటు పైడిగుమ్మల్, ఖానాపూర్, కొత్తూర్(కె), రాజనెల్లి, పీచేర్యాగడి తదితర గ్రామ శివార్లలో రైతులు చింత చెట్లను పెంచి పోషిస్తున్నారు. మూడు, నాలుగు వందల ఏళ్ల వయస్సుగల ఎత్తయిన చింత చెట్లు వేల సంఖ్యలో ఉన్నాయి.

గిట్టుబాటు ధర కరువు

- మండలంలో పండించిన చింత పండు గింజలు తీసి వాలిని రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలలోని మార్కెట్లలో విక్రయిస్తారు. గత రెండేళ్లుగా మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర లభించడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వింటాల్‌కు రూ.6 నుంచి రూ.8 వేలు మాత్రమే పలుకుతుందని చెబుతున్నారు.
- గిట్టుబాటు ధర లభించకపోవడంతో చింత చెట్లను లీజుకు తీసుకోవడానికి వ్యాపారులు చొరవ చూపడంలేదు. ఈ సారి మండలంలో ఉన్న సగం చెట్లు వృథాగా ఉన్నాయన్నారు. పండు నేలరాలిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- చింత పండు నిల్వ చేసుకోవడానికి కోల్డు స్టోరేజీలు అందుబాటులో లేక రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో అందినకాడికి అమ్ముకోవాల్సివస్తోంది.

మొదటిసారి చీడపీడలు

- చింతపండుకు చీడపీడలు సోకిన దాఖలాలు గతంలో లేవని, ఈసారి చీడపీడలు సోకి 40 శాతం పంట నష్టపోయామని, గురువారం కురిసిన అకాల వర్షానికి, వడగండ్ల వానకు పండిన తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. తడిసిన చింతపండుకు డిమాండ్ ఉండదంటున్నారు.

కూలీల కొరత

- చింత సాగు చాలా సులభం. ఒకసారి నాటితే చాలు ఏళ్ల తరబడి దిగుబడులను ఇస్తుంది. పైగా ఒక స్థాయికి ఎదిగిన తరువాత నీరందించాల్సిన అవసరం ఉండదు. ఎరువులు, మందులు వాడాల్సిన పనిలేదు.
- అయితే పండిన పంటను ఎత్తయిన చెట్ల నుంచి దించడానికి తీవ్రంగా శ్రమించాల్సిఉంటుంది. చెట్లు ఎక్కే నైపుణ్యం ఉన్న కూలీల కొరత తీవ్రంగా ఉంది.
- అందుబాటులో ఉన్న కొద్దిమంది కూలీలు రోజు కూలి రూ. 1200 నుంచి రూ. 1500ల వరకు తీసుకుంటున్నారు. పండు సేకరణ, పైపొట్టు, పిక్కలు తీయడానికి, గట్టలు కట్టడానికి, రవాణాకు అదనంగా ఖర్చుచేయాల్సి ఉంటుంది.

ప్రాణాలతో చెలగాటం.

- సుమారు 20 నుంచి 25 మీటర్ల ఎత్తులోఉన్న చింత పండును వెదురు కర్రతో రాల్చడం ప్రమాదకరం. ఈ క్రమంలో ఏమాత్రం ఎమరుపాటుగా ఉన్నా ప్రాణాలు పోవడం ఖాయం.
- చింత చెట్లపై నుంచి పడి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు అనేకం. ఈ ఏడాది చింత పండు రాలుస్తూ ప్రమాదవశాత్తు కిందపడి మండలంలోని రాజనెల్లి గ్రామానికి చెందిన నర్సింలు, కోహీర్ పట్టణంలోని బసంత్పూర్ నివాసి వాజిద్‌లు ప్రాణాలు కోల్పోయారు.
- మండలంలోని మాచిరెడ్డిపల్లి, జహీరాబాద్ మండలంలోని రంజోల్లో మరొకరు చింతచెట్ల పైనుంచి పడి చనిపోయారని, కోహీర్ పట్టణంలోని బాహెర్వాడికి చెందిన ఖలీల్ చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడని రైతులు తెలిపారు.
- బాధితులకు నష్టపరిహారం చెల్లించి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండిన పంటను చెట్టు నుంచి వేరు చేసేందుకు ఆధునిక పరికరాలను అందుబాటులోకి తేవాలని, పంటకాలంలో పంటను నిల్వ చేసుకోవడానికి కోల్డు స్టోరేజీ సదుపాయం కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నారు.

రెండేళ్లుగా నష్టాలే



రెండేళ్లుగా చింతపండుకు మార్కెట్లో డిమాండ్ లేదు. వడగళ్ల వానతో పంటకు నష్టం వాటిల్లడంతో పాటు ధరలు గణనీయంగా పడిపోయాయి. ఈసారి కొత్తగా చీడపీడల సోకి 40 శాతం పంటకు నష్టం వాటిల్లింది. పంట నూర్పిడికి కూలీల కొరత తీవ్రంగా ఉంది. రోజు కూలి రూ.12 నుంచి 1500 తీసుకుంటున్నారు. పొట్టు తీసి గట్టలు కట్టడానికి అదనంగా చెల్లించాలి. సరైన గిట్టుబాటు ధర లభించక 50 శాతం చింత చెట్లు కొనుగోలుకు నోచుకోలేదు.

– సపోటవాలే ఖయ్యూమ్, రైతు, బసంత్పూర్, కోహీర్

ప్రాణాలతో చెలగాటం



నేను 30 ఏళ్లుగా చింత పంట నూర్పిడిలో కూలిగా పనిచేస్తున్నాను. మూడు నాలుగు వందల ఏళ్ల వయస్సు శాఖోపశాఖలుగా విస్తరించిన 25, 30 మీటర్ల ఎత్తయిన చెట్లపై ఎక్కి రక్షణలేకుండా చింత పంటను రాల్చడం ప్రాణాలతో చెలగాటమే. చెట్లపై నుంచి పడి నా తోటి కూలీలు ఎందరో ప్రాణాలు కోల్పోయారు. వారి కుటుంబాలు అనాథలయ్యాయి. చెట్లపై నుంచి పంటను దింపడానికి ప్రత్యామ్నాయ మార్గాలు కల్పించాలి.

– లంగ్డివాలే మాజిద్, కూలీ, కోహీర్

108 సిబ్బంది సేవలు అభినందనీయం

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



108 సిబ్బందిని సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

చిన్నకోడూరు(సిద్దిపేట): గ్రామీణ ప్రాంతాల్లో 108 సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. మండల పరిధిలోని చంద్లాపూర్ శివారులో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీ దంపతుల పాప ప్రాణం కాపాడిన 108 సిబ్బంది అశోక్, వెంకట్‌ను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల రోజుల పాపకు శ్వాస ఆగిపోవడంతో వైద్యుల సూచనలతో చికిత్స చేస్తూ ఆస్పత్రికి తరలించడంతో పాప బతికిందన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న షీ టీమ్స్ సభ్యులు

దుబ్బాక: మహిళలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా షీటీమ్స్ సిబ్బంది పద్మ, సంగీత అన్నారు. గురువారం దుబ్బాక దేశాయి బీడీ కంపెనీలో మహిళలకు పోక్సో చట్టం, బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్‌టీజింగ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీ టీమ్స్ సిబ్బంది ప్రకాష్, స్వామి

బైక్ అదుపు తప్పి డివైడర్ ఢీకొని..

- 8వ తరగతి విద్యార్థి మృతి
- మరోవిద్యార్థికి గాయాలు
- మూలమలుపులో ప్రమాదాలు జరుగుతున్న వైనం



ఫయాజ్ అలీ (ఫైల్)

జోగిపేట(అందోల్): డివైడర్‌ను బైక్ ఢీకొనడంతో విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. జోగిపేటలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ఫయాజ్ అలీ(14) 8వ తరగతి చదువుతున్నాడు.

బైకుపై మరో విద్యార్థితో కలిసి అందోల్ నుంచి జోగిపేట వస్తున్నాడు. ఈ క్రమంలో ఫైర్‌స్టేషన్ మలుపువద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో ఫయాజ్ అలీకి తీవ్రంగా, మరో విద్యార్థికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆటోలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే అంబులెన్స్‌లో సంగారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా చౌటకూరు సమీపంలో తుదిశ్వాస విడిచినట్లుగా చెబుతున్నా సంగారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లగా డాక్టర్లు పరీక్షించి చనిపోయినట్లుగా నిర్ధారించారు. పోస్టుమార్టం నిర్వహించి జోగిపేటకు తరలించారు. జోగిపేటలో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా వెంటిలేటర్ ఉన్నట్లయితే ఆస్పత్రికి వెళ్లేవరకైనా బాలుడు బతికేవాడని స్థానికులు చర్చించుకున్నారు.

హైవే అధికారుల నిర్లక్ష్యం

ఫైర్ స్టేషన్ వద్ద ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికిపైగానే మృత్యువాతపడ్డారు. పది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఫైర్ స్టేషన్ మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్‌లు వేయిస్తామని హైవే అథారిటీ అధికారి హామీ ఇచ్చి మూడు నెలలు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

సంగారెడ్డి టౌన్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పలువురని అరెస్ట్ చేశారు. గురువారం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు సంగారెడ్డి పట్టణంలోని బ్యాంక్ కాలనీలో బుధవారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.43,830 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

కలుషిత నీరు తాగిన గేదె మృతి

పటాన్‌చెరు టౌన్: కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన గేదె మృతి చెందింది. ఈ సంఘటన గురువారం జరిగింది. ఎస్‌ఐ కిష్టారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ మండలంలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన కుమ్మరి రాజుకు చెందిన రెండు గేదెలు బొల్లారం పారిశ్రామికవాడ నుంచి వచ్చిన కలుషిత నీరు తాగి బుధవారం అస్వస్థతకు గురయ్యాయి. వాటితో పాటు మరో 12 గేదెలు కూడా అస్వస్థతకు గురయ్యాయి. వాటికి మండల పశువైద్యులు చికిత్స అందిస్తున్నారు. అందులో రాజుకు చెందిన ఒక గేదె మృతి చెందింది. రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుతో పాడి గేదె, ఆవు మృతి

మద్దూరు(హుస్నాబాద్): అకాల వర్షంలో పిడుగు పడి పాడిగేదె, ఆవు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండలంలో రేబర్తి గ్రామంలో జరిగింది. గురువారం బాధిత రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బెల్లపు యాదయ్య, వంగపల్లి రాములు రోజు మాదిరిగానే బుధవారం రాత్రి తమ వ్యవసాయ బావి వద్ద గేదెను, ఆవును కట్టేసి ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం బావి వద్దకు వెళ్ల చూడగా అవి మృతి చెంది కనిపించడంతో బోరున విలపించారు. పాడిగేదె రూ.70 వేలు, ఆవు విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



గేదె కళేబరం

ఆకునూరులో బయల్పడిన నాటి నేత పనిముట్టు 'స్పూల్ని'

గుర్తించిన చరిత్ర బృందం సభ్యుడు శ్రీనివాస్



పురాతన నేత పనిముట్టు స్పూల్ని

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు శివారులో పురాతన నేత పనిముట్టు బయల్పడినట్లు కొత్త తెలంగాణ చరిత్ర బృందం అన్వేషకుడు కొలిపాక శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఆకునూరు పాటి గడ్డమీద అరుదైన మట్టి పనిముట్టు స్పూల్ నూలు చుట్టే గిలకని గుర్తించారు. ఇది సుమారు 2 వేల ఏళ్లకు పూర్వపు మట్టి పనిముట్టని నేత పనిలో పని కొచ్చే అరుదైన పరికరమన్నారు. దారం వడికి, కండెలు చుట్టడానికి పనికొచ్చే ఈ స్పూల్ కదురుకు ముందరి రూపంతో చిన్న గిలకవలె వుండే దీనిని దారంచుట్టడానికి ఉపయోగించేవారన్నారు. ఈ స్పూల్ మధ్యలో ఉండే రంధ్రంలో కట్టెపుల్ల నుంచి కదురులెక్క తిప్పడం, దారపు పోగుల్ని వేగంగా చుట్టడానికి గిలకలెక్క వాడేవారన్నారు. మట్టితో చేసిన ఈ స్పూల్ ఇసుకమట్టితో చేసినట్టుందని, మట్టిలో ఉండి పైపొర తొలుచుకుని పోయిందని తెలిపారు. ఇది 2 సెంటీమీటర్ల మందం, 3 సెంటీమీటర్ల వెడల్పు ఉందన్నారు.

కోర్టు కేసులోని భూములు పట్టా చేయొద్దు

సీపీఐ జిల్లా కార్యదర్శి టీఎం కాలేక్



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి టీఎం కాలేక్

నర్సాపూర్: వ్యవసాయ భూమికి సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున, ఆ భూమిని ఎవరి పేర పట్టా చేయొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి టీఎం కాలేక్ కోరారు. గురువారం ఈమేరకు మండల తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని నత్నాయిపల్లి గ్రామంతో పాటు సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల్ల మండలం గుమ్మడిదల్ల, శేరికాన్‌పల్లి, మంగంపేట గ్రామాల పరిధిలో 1 నుంచి 31 సర్వే నంబర్లలో సుమారు 653 ఎకరాల 15 గుంటల భూమి ఉందన్నారు. కాగా ఆయా సర్వే నంబర్లలోని భూమిలో ఆయా గ్రామాలకు చెందిన సుమారు 300 రైతు కుటుంబాలు సుమారు 20 నుంచి 25 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నారన్నారు. కొందరు రియల్ వ్యాపారులు హైకోర్టులో భూములు తమవేనని కేసు వేశారని తెలిపారు. కేసు పెండింగ్‌లో ఉన్నదని, ఆయా గ్రామాలకు చెందిన కొందరు రియల్ వ్యాపారులతో కుమ్మక్కయి ఆ భూములను తమ పేరు మీద పట్టా చేయించుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఆర్‌ఐతో విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసినవారిలో నాయకులు కృష్ణ, సంజీవరెడ్డి, చంద్రారెడ్డి ఉన్నారు.

దంపతుల వాగ్వాదం

- అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని భార్య ఆరోపణ
- విడాకుల కేసు కోర్టులో ఉందన్న భర్త



భర్తతో గొడవపడుతున్న అంజలి

మద్దూరు(హుస్నాబాద్): అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని భార్య విలేకర్లకు మొరపెట్టుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన మాజీ సైనికుడు బద్దిపడగ శ్రీనివాస్‌రెడ్డి ఇంటి ముందు బుధవారం అతడి భార్య అంజలి నిరసన చేపట్టింది. దీనికి బదులుగా గురువారం శ్రీనివాస్‌రెడ్డి మండల కేంద్రంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతున్నాడు. అంజలి అక్కడికి వచ్చి వాగ్వాదానికి దిగడంతో శ్రీనివాస్‌రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అంతకు ముందు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అవినీతిపై ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేయడంతో ఎంపీపీ కృష్ణారెడ్డి, తన భార్యను తనపై ఉసిగొల్పుతున్నాడని ఆరోపించారు. తమ విడాకుల కేసు ప్రస్తుతం కోర్టులో ఉందని, కోర్టు తీర్పుకు అనుగుణంగా తాను వ్యవహరిస్తానని శ్రీనివాస్‌రెడ్డి తెలిపాడు.

విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రోత్సాహం

షెడ్యూల్డ్ క్యాస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు మహంకాళి



మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు మహంకాళి

సిద్దిపేటకమాన్: షెడ్యూల్ కులాల విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా షెడ్యూల్డ్ క్యాస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ పనిచేస్తుందని సొసైటీ అధ్యక్షుడు మహంకాళి అన్నారు. గురువారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో సొసైటీ సభ్యులు కౌన్సిలర్ గ్యాదరి రవీందర్, రామస్వామితో కలిసి మాట్లాడారు. షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఆపై తరగతులు చదువుతున్న వారిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి సొసైటీ ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. అందులో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి నాడు ప్రతీ విద్యార్థికి నగదు, ప్రశంసా పత్రం అందజేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని వర్గాల షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు ఈనెల 11వ తేదీ లోపు సొసైటీ సభ్యులను సంప్రదించాలని సూచించారు. మంత్రి హరీశ్‌రావు సహకారంతో సొసైటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

మూకుమ్మడి దాడిలో వ్యక్తికి గాయాలు

పోలీసులకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు



దాడిలో గాయపడిన లింగం

చేర్యాల(సిద్దిపేట): ఓ వ్యక్తిపై మూకుమ్మడి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని వీరన్నపేట గ్రామానికి చెందిన సూర్న లింగం బుధవారం రాత్రి గ్రామపంచాయతీ వద్ద ప్రదర్శించిన బలగం సినిమా చూశాడు. ఇంటికి వెళ్లి ఇంటి ముందు నిద్రించాడు. గురువారం తెల్లవారు జామున లేచి చూడగా ఇంటి ముందు లేడు. బావి దగ్గరకు వెళ్తున్న పెద్ద కుమారుడు సూర్న ప్రవీణ్‌కు వడ్లమార్కెట్ వద్ద లింగం టవల్, చెప్పులు పడిఉన్నాయి. అక్కడే రక్తం మరకలు ఉండడాన్ని చూసిన ప్రవీణ్ వెంటనే ఇంటికి వచ్చాడు. అప్పటికే ఇంటికి వచ్చిన శ్రీకాంత్ మీనాన్న సద్దు జాచారి ఇంటి ముందు రక్తగాయాలతో పడిఉన్నాడని చెప్పాడు. వెంటనే అక్కడికి వెళ్లి 108లో చేర్యాల ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం గాంధీకి తరలించాలని సూచించారు. తమ తండ్రిపైపై దాడి చేసిన ఎస్.మల్లేశం, పి.ప్రసాద్, జె.భాస్కర్‌పై చట్ట రీత్యా చర్య తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చెరువులో స్నానానికి దిగి వ్యక్తి మృతి



కొమురయ్య మృతదేహాన్ని తెస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: చెరువులో స్నానానికి దిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని జాలిగామకు చెందిన ఎక్కల మల్లయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. అతడి అంత్యక్రియలు గురువారం నిర్వహించారు. అంత్యక్రియలు పూర్తయ్యాక మృతుడి బంధువు ఇదే గ్రామానికి చెందిన గుడిసె కొమురయ్య(48) చెరువులో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టగా కొమురయ్య మృతదేహం లభించింది. కొమురయ్యకు భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాడుబడిన బావిలో పడిన ట్రాక్టర్

తీవ్ర గాయాలతో బయటపడ్డ డ్రైవర్



డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న గ్రామస్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): ట్రాక్టర్ అదుపు తప్పి పాడుబడిన బావిలో పడిపోయిన ఘటన మండల పరిధిలోని ధర్మారంలో గురువారం చోటు చేసుకుంది. ట్రాక్టర్‌తో పాటు బావిలో పడి తీవ్ర గాయాలపాలైన డ్రైవర్‌ను బయటకు తీసుకురావడానికి పోలీసులు, గ్రామస్తులు సుమారు రెండు గంటల పాటు శ్రమించాల్సి వచ్చింది. ప్రమాద విషయం దావానంలా వ్యాపించడంతో జనం తండోప తండాలుగా ఘటనా స్థలానికి తరలి వచ్చారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో ఉన్న ఓ పాడుబడిన బావిని మట్టితో పూడ్చివేస్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి బావిలో పడిపోయింది. డ్రైవర్ దుర్గుల్ సైతం ట్రాక్టర్‌తో సహా బావిలో పడిపోవడాన్ని గమనించిన స్థానికులు మిరుదొడ్డి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ శ్రీధర్ గౌడ్‌తో పాటు పోలీసు సిబ్బంది గ్రామస్తుల సహకారంతో రెండు గంటల పాటు శ్రమించి క్రేన్‌ల సాయంతో దుర్గుల్‌ను బయటకు తీశారు. హుటాహుటిన అతడిని చికిత్స కోసం 108 వాహనంలో సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడిన కలెక్టర్ సతీమణి



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

సిద్దిపేటఅర్బన్: ఇన్నోవా వాహనాన్ని టిప్పర్ ఢీకొన్న ఘటనలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సతీమణి జ్యోతి ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. కలెక్టర్ సతీమణి గురువారం మధ్యాహ్నం క్యాంపు కార్యాలయం నుంచి సిద్దిపేటకు వస్తుండగా పొన్నాల శివారులో వెనక నుంచి టిప్పర్ ఇన్నోవా వాహనాన్ని పక్క నుంచి ఢీకొట్టింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని త్రీటౌన్ సీఐ భాను ప్రకాశ్ తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

గజ్వేల్ రూరల్: భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మర్కుక్ మండలం అలిరాజపేట గ్రామానికి చెందిన ఎనుగుల మాధవరెడ్డి(31)కి కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం గుర్జకుంట గ్రామానికి చెందిన మాళవికతో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. పుట్టింటికి వెళ్లిన మాళవిక ఆరు నెలలైనా కాపురానికి రాలేదు. మాళవికతో మాట్లాడేందుకు మాధవరెడ్డి తల్లిదండ్రులు సిద్ధమవగా బుధవారం గజ్వేల్ బస్టాండ్‌లో వారిని రామాయంపేట బస్సు ఎక్కించి, తాను బైక్‌పై వస్తానని చెప్పి ఆగిపోయాడు. తీవ్ర మనోవేదనకు గురైన మాధవరెడ్డి ప్రజ్ఞాపూర్‌లోని జీపీపీ ఆర్టీసీ బస్‌డిపో వెనుక క్యాసారం వెళ్లే మార్గంలో ఓ పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గుర్తు తెలియని మృతదేహం పడిఉన్నట్లు స్థానికులు గురువారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మాధవరెడ్డి తల్లిదండ్రులకు తెలియజేయడంతో సంఘటనా స్థలానికి చేరుకొని మాధవరెడ్డి మృతదేహంగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.